ప్రజాశక్తి

బుధవారం 19 మార్చి 2025

పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు

శ్రీకాకుళం : పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లాలోని పలు రాజకీయ పార్టీలతో జిల్లా ఎన్నికల అధికారి, ఎలక్ట్రోరల్ అధికారి స్థాయిలో ప్రతి నెలా నిర్వహించాల్సిన గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలతో కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. బూత్‌స్థాయి అధికారుల నియామకాలు, పోలింగ్ బూత్‌లకు సంబంధించి అంశాలపై చర్చించి పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు తదితర వాటిపై సమీక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలు, సలహాలను స్వీకరించారు. సమావేశంలో టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, వైసిపి నాయకులు ఆర్.శంకరరావు, కాంగ్రెస్ నాయకులు కె.ఎల్.ఎస్ కుమారి, సిపిఎం నాయకులు ఎం.గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

రబీలోనూ గడ్డు పరిస్థితులే

- వర్షాల్లేక ఎండిపోతున్న వరి
- నువ్వు పంటపైనా ప్రభావం
- సాధారణ సాగులో 32 శాతం తగ్గుదల
- వర్షాభావ పరిస్థితులతో గణనీయంగా తగ్గిన సాగు

రబీలోనూ అన్నదాతలకు గడ్డు పరిస్థితులే ఎదురయ్యాయి. 2024 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేలాది ఎకరాల్లో పంటలు వేయలేకపోయారు. రబీలోనైనా నష్టాన్ని భర్తీ చేసుకుందామని భావించిన రైతులకు ప్రకృతి కరుణించలేదు. ఈ ఏడాది జనవరి తర్వాత కనీసం చినుకు కూడా కురవలేదు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సగం విస్తీర్ణం మేర వరి వేయగా, అందులో సగం కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు. డిసెంబరులో పలుమార్లు ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో కురిసిన వర్షాలకు అపరాల సాగుపై తీవ్ర ప్రభావం పడింది.

కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురంలో ఎండిపోతున్న వరి పంట

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రబీలో సాధారణంగా అన్నిరకాల పంటలు కలిపి మొత్తం 1,98,493 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఈ ఏడాది 1,34,635 ఎకరాల (68 శాతం) మేర సాగయింది. వరి సాగు పరిస్థితి దయనీయంగా ఉంది. రబీలో వరి సాధారణ సాగు 21,573 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 11,873 ఎకరాల్లో (55 శాతం) మాత్రమే వేయగలిగారు. వర్షాలు లేకపోవడంతో సగం మేర పంట ఎండిపోయింది. వంశధారలో నీటి నిల్వలు అడుగంటిపోవడంతో పంట కాలువలు ఎండిపోయాయి. రాగులు సాధారణ సాగు విస్తీర్ణం 5,155 ఎకరాలు ఉండగా 3,430 (67 శాతం) ఎకరాల్లో సాగవుతోంది.

అపరాల సాగుపై తీవ్ర ప్రభావం

డిసెంబరులో పలుమార్లు ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. పొలాల్లో వర్షపు నీరు చేరి పెసర, మినప పంటలకు వందలాది ఎకరాల్లో నష్టం వాటిల్లింది. తేమ శాతం ఎక్కువ ఉండడంతో మినుము, పెసర పంటలను వేయలేకపోయారు. రబీలో రైతులు సాధారణంగా 39,240 ఎకరాల్లో పెసర పంట వేసే పరిస్థితి ఉండగా 24,393 ఎకరాల్లో (62 శాతం) వేయగలిగారు. మినప పంట సాధారణ సాగు 60,753 ఎకరాలు కాగా, ఈ సీజన్‌లో 38,253 ఎకరాల్లో (63 శాతం) సాగవుతోంది. నువ్వుల పంట కూడా సగం విస్తీర్ణంలోనే సాగయింది. సాధారణంగా 12,115 ఎకరాల్లో వేసే పరిస్థితి ఉండగా, ఇప్పటివరకు రైతులు 6,228 ఎకరాల్లో (51 శాతం) మాత్రమే వేయగలిగారు.

మిగిలిన పంటలదీ అదే పరిస్థితి

పొద్దుతిరుగుడు పంట 553 ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా, 75 (14 శాతం) మాత్రమే వేయగలిగారు. చెరకు పంట సాధారణ సాగు 2,755 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 255 ఎకరాల్లో (9 శాతం) మాత్రమే వేశారు.

ఆ మూడు పంటలు కాస్త నయం

వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా మొక్కజొన్న, కట్టె జనుము, వేరుశనగ పంటల సాగు పరిస్థితి కాస్త పర్వాలేదనిపిస్తోంది. మొక్కజొన్న పంట సాగు పరిస్థితి కాస్త బాగానే ఉంది. రబీలో సాధారణంగా 40,675 ఎకరాల్లో సాగవుతుండగా ఈ సీజన్‌లో 37,265 ఎకరాల విస్తీర్ణంలో (92 శాతం) సాగయింది. కట్టెజనుము సాధారణ సాగు 2,808 ఎకరాలు కాగా 2,558 ఎకరాల్లో (91శాతం) మేర సాగయింది. వేరుశనగ పంటను రబీ సీజన్‌లో సాధారణంగా 10,485 ఎకరాల్లో రైతులు సాగు చేస్తుంటారు. ఇప్పటివరకు 8,360 ఎకరాల్లో (80శాతం) పంటలు వేశారు.

మూడు నెలలుగా చినుకు చుక్క కరువు

రబీలో జనవరి, ఫిబ్రవరి, మార్చిలో కనీసం చినుకు చుక్క కురవలేదు. జనవరిలో సాధారణంగా 6.1 మి.మీ, ఫిబ్రవరిలో 19.5 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా సున్నాగా నమోదైంది. మార్చిలో 19.7 మి.మీ సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా సున్నాగా నమోదైంది. రబీ సీజన్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. అక్టోబరులో 192.3 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 39.5 మి.మీ వర్షం కురిసింది. నవంబరులో 99.2 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 7.1 మి.మీ వర్షం పడింది. డిసెంబర్‌లో అతివృష్టి నమోదు కావడమూ పంటలకు నష్టం వాటిల్లింది. డిసెంబరులో 2.8 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, వరుసగా అల్పపీడనాలు సంభవించడంతో 101.1 మి.మీ వర్షం కురిసింది.

అడుగంటిన రిజర్వాయర్లు

వర్షాలు కురవకపోవడంతో వంశధార, నాగావళి నదులు ఎండిపోయాయి. రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటిపోయాయి. గొట్టాబ్యారేజీ పూర్తి సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.08 టిఎంసిలకు పడిపోయింది. మడ్డువలస పూర్తి సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 1.98 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది.

ధర్నా చేస్తున్న ఇపిఎస్ పెన్షనర్లు

ఇపిఎస్ పెన్షనర్లపై కేంద్రం వివక్ష

- కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి
- పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇపిఎస్ పెన్షనర్లపై కేంద్ర ప్రభుత్వం, ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ అనుసరిస్తున్న ఉదాసీన వైఖరితో పెన్షనర్లు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని పిఎఫ్ కార్యాలయం వద్ద ఇపిఎస్ పెన్షనర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగుల్లో సుమారు 37 లక్షల మందికి నెలకు రూ.వెయ్యి లోపు పెన్షన్ తీసుకుంటున్నారని తెలిపారు. 90 శాతం మంది రూ.మూడు వేల లోపు పెన్షన్ పొందుతున్నారని చెప్పారు. కేవలం పది శాతం మంది మాత్రమే రూ.ఐదు వేలు పొందుతున్నారని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర, ప్రైవేట్, సహకార సంస్థల్లో ఇపిఎస్ ఉద్యోగులుగా 30, 40 ఏళ్ల పాటు ఉత్పత్తి, సేవా రంగాల్లో పనిచేసి దేశాభివృద్ధికి కీలకమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. అటువంటి ఉద్యోగులు కనీస అవసరాలూ తీర్చుకోలేని దుర్భర పరిస్థితుల్లో వృద్ధాప్యం గడుపుతున్నారని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇపిఎస్ కార్పస్ ఫండ్‌పై వచ్చిన వడ్డీ రూ.58,669 కోట్లు కాగా పెన్షన్ చెల్లింపు రూ.15,130 కోట్లు మాత్రమేనన్నారు.

చెల్లించిన సరాసరి పెన్షన్ రూ.1592 మాత్రమే అని చెప్పారు. మొత్తం వడ్డీ పెన్షన్ చెల్లింపునకు వినియోగించినా సరాసరి పెన్షన్ రూ.5731 చెల్లించవచ్చన్నారు. పెన్షనర్ మరణించిన తర్వాత తన భవిష్యత్ నిధి మొత్తం లబ్ధిదారులకు చెల్లించకుండా కార్పస్ ఫండ్‌కు జమ చేయడం వల్ల ఏటా కార్పస్ ఫండ్ పెరుగుతోందన్నారు. బతికున్న పెన్షనర్లకు మాత్రం పెన్షన్ పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పథకం మొదలైన నాటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోందని, దీనివల్ల పెన్షనర్లు కనీస వైద్య సేవలు కూడా పొందలేని స్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రో రేటా పద్ధతిలో పెన్షన్ లెక్కించడం, ఉద్యోగ విరమణ ముందు 60 నెలల సరాసరి మూలవేతనం పెన్షన్ లెక్కింపు వల్ల చెల్లించాల్సిన పెన్షన్ మరింత తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలతో పాటు కరువు భత్యం చెల్లించాలని, ఇపిఎస్ పెన్షనర్లకు, ప్రభుత్వం నిత్యావసర సరకులు సరఫరా చేయాలన్నారు. ప్రయాణ ఖర్చులు రాయితీ, ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ కార్పస్ ఫండ్‌ను షేర్ మార్కెట్‌లో పెట్టకుండా, గ్యారెంటీ పద్ధతిలో మదుపు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, పి.వాసుదేవరావు, బి.శివాజీ, ఇతర పెన్షనర్లు పాల్గొన్నారు.

గెద్దలపాడు 'ఆశా'కు న్యాయం చేయాలి

అధికారులకు ఆశావర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సంతబొమ్మాళి మండలం బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గెద్దలపాడు కేంద్రంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న నుత్తు చంద్రమ్మకు న్యాయం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, ప్రధాన కార్యదర్శి జి.అమరావతి, ఉపాధ్యక్షులు వై.సుజాత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కోరారు. ఆశా ఉద్యోగానికి రాజీనామా చేయకుంటే రూ.రెండు లక్షలు చెల్లించాలంటూ గ్రామ పెద్దలు చెప్పారని, అందుకు నిరాకరించిన ఆమెను గ్రామ బహిష్కరణ విధించారని వివరించారు. ఇదే విషయమై ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాలమురళీకృష్ణను మంగళవారం కలిసి వినతిపత్రాలను అందజేశారు. చంద్రమ్మ 2014 నుంచి ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ సేవలందిస్తున్నారని తెలిపారు. ఆమెను తొలగించి రూ.రెండు లక్షలకు వేలం పాట నిర్వహించడంతో పాటు ఎనిమిది నెలలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఈనెల 17 నుంచి విధులకు హాజరు కావద్దంటూ గ్రామ పెద్దలు హుకుం జారీ చేశారన్నారు. ఆమెకు గ్రామంలో ఎవరూ సహకరించకూడదంటూ దండోరా వేయించి కుటుంబాన్ని గ్రామం నుంచి వెలి వేశారన్నారు. గ్రామంలో ఎవరు ఎటువంటి సహాయం అందించకూడదని, ఆశా కార్యకర్తగా ఆమె ఇచ్చిన మందులు తీసుకోకూడదంటూ ఆదేశించారని వివరించారు. అధికారులు జోక్యం చేసుకుని ఆశా కార్యకర్త చంద్రమ్మకు న్యాయం చేయాలని, ఆమెను విధుల్లో కొనసాగిస్తూ గ్రామ బహిష్కరణకు ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జెసికి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో అనుమతులు

- పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందడానికి వీలుగా ప్రభుత్వ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహంపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విండోకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం విజయరత్నం మాట్లాడుతూ 15 దరఖాస్తులు రాగా, 13 ప్రాసెస్‌లో ఉన్నాయని వివరించారు. పిఎంఇజిపిలో 69 లక్ష్యం కాగా 90 అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. పిఎం విశ్వకర్మ పథకం ద్వారా 6,599 మందికి అనుమతులు ఇచ్చామని, వారిలో 5,884 మందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ కరుణ శ్రీ, ఎపిఐఐసి జెడ్‌ఎం ఎం.మురళీ మోహనరావు, అగ్నిమాపక శాఖ అధికారి మోహనరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.రాంబాబు, ఎడి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పలు శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, రీసర్వే ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంకు, కోర్టు కేసులు, వక్ఫ్ ఆస్తుల సర్వే వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకూడదని స్పష్టం చేశారు. నిర్దేశించిన, పూర్తి చేసిన గోకులాలపై ఆరా తీశారు. రానున్న రెండు రోజుల్లో వాటిని సైతం వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెటింగ్, మత్స్య, ఉద్యాన, పరిశ్రమలు, గృహనిర్మాణ శాఖల లక్ష్యాలపై దృష్టిసారించాలన్నారు. వేసవిలో వసతిగృహాల భవనాల మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎంపిడిఒలు గృహ నిర్మాణాలకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులకు మాత్రమే లబ్ధి చేకూరేలా చూడాలని, ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. పిఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, ఐసిడిఎస్, డ్వామా, హౌసింగ్ పీడీలు బి.శాంతిశ్రీ, సుధాకర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో మృతురాలు నాగమ్మ ఫైల్)

భార్యను హతమార్చిన భర్త

పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మండలంలోని సంతసీతారాంపురం (ఎస్‌ఎస్‌ఆర్ పురం) గ్రామానికి చెందిన గాలి నాగమ్మ (45)ను ఆమె భర్త గాలి అప్పలరెడ్డి సోమవారం రాత్రి కత్తితో నరికి హతమార్చాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు హత్యకు వినియోగించిన కత్తి తీసుకొని వెళ్లి నిందితుడు లొంగిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. భార్యాభర్తలు ఇద్దరూ వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఇద్దరూ కలిసి రణస్థలం మండలం కొవ్వాడలో నీలగిరిచెట్టు బెరడు తొలిచే కూలి పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగొచ్చారు. రాత్రి భోజనం ముగించిన తర్వాత భార్యాభర్తల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. అప్పటికే మద్యం తాగి ఉన్న అప్పలరెడ్డి చెట్టు బెరడు తొలగించడానికి ఉపయోగించే కత్తితో నాగమ్మపై విచక్షణారహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సంఘటనా స్థలానికి జె.ఆర్ పురం సిఐ అవతారాం, ఎస్ఐ సందీప్‌తో పాటు క్లూస్ టీమ్ చేరుకొని ఆధారాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు విశాఖపట్నంలో తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. మృతురాలి సోదరుడు త్రినాథరావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులపై దృష్టిసారించాలి

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్రంలో 14 ఏళ్లుగా దీర్ఘకాలిక సమస్యగా ఉన్న టిజిటి, పిజిటి ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే దృష్టిసారించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. ఇదే అంశాన్ని శాసనసభలో మంగళవారం ప్రశ్నించారు. రాష్ట్రంలో 126 సైన్స్ కళాశాలల్లో 86 మంది ఉపాధ్యాయులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యపై 2010లో కమిటీ విచారణ కూడా చేపట్టినట్లు గుర్తుచేశారు. 2023లోనూ ఇదే సమస్యపై మరో కమిటీ విచారణ చేసి వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని సిఫార్సు చేసిందని తెలిపారు. గతంలోనూ ఈ సమస్యను తాను అసెంబ్లీలో ప్రస్తావించానని, నేటికీ సమస్య పరిష్కారం కాలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్య విద్యార్థులకు సంబంధించిన అంశమని, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా 8, 9, 10 తరగతుల్లో విద్యా బోధన చేస్తున్న టిజిటి, పిజిటి ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతులు లేక నిరీక్షించడానికి అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ మంత్రి, ఆ శాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా తరగతులను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యాభివృద్ధిని పొందాలన్నారు. కాలానుగుణంగా కార్యాలయాలకు ఉపయోగపడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఎక్సెల్ షీట్స్ తదితర వాటిపై కంప్యూటర్‌లో శిక్షణ తీసుకొని సాంకేతికత నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు ఒంటిపూట

శ్రీకాకుళం : ఈనెల 18 నుంచి మే 31వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలను ఒంటి పూట నిర్వహిస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమశాఖ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు వేడి ఆహారం ఇచ్చి వారి గృహాలకు పంపాలని తెలిపారు.

'మత్తు'కు యువత దూరంగా ఉండాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు

ప్రజాశక్తి - పలాస

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు యువతకు పిలుపునిచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో మహిళా పోలీసులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు పాఠశాలల వరకు మత్తు పదార్థాలు రవాణా అవుతున్నాయని, వాటిని అరికట్టేందుకు మహిళా పోలీసులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఆడపిల్లల భద్రత, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహనా సదస్సులు నిర్వహించాలని సూచించారు. లైంగిక వేధింపులకు ప్రధాన కారణం సెల్‌ఫోన్, మత్తు పదార్థాలేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల వద్ద ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాటిని 15 రోజులకోసారి తెరిచి సమస్యలను పరిష్కరించాలన్నారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించడంతో పాటు బాలకార్మికులను గుర్తించి, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యత మహిళా పోలీసులు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా, బాల కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు. అంతకుముందు పలాస-కాశీబుగ్గలోని జీడి పరిశ్రమలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి రమణ, కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, అసిస్టెంట్ లేబర్ అధికారి ఎన్.విజయ్ కుమార్, ఐసిడిఎస్ పిఒ పార్వతి, సూపర్‌వైజర్ యు.లత, ఎం.మల్లేశ్వరరావు, మండల పరిషత్ ఎఒ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

బాలికపై అత్యాచారం!

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని తొత్తిడిపుట్టుగకు చెందిన పదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు అత్యాచారానికి ఒడిగట్టినట్లు విశ్వసనీయ సమాచారం. వారం రోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూడడంతో స్థానికంగా కలకలం రేపింది. బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిందితుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అభం శుభం తెలియని బాలిక జరుగుతున్న సంఘటనకు భయపడి కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. మరుసటి రోజు ఉదయం ముభావంగా ఉన్న బాలికను తల్లి ప్రశ్నించడంతో అసలు విషయం చెప్పింది. దీంతో సోమవారం రాత్రి బాలిక తల్లిదండ్రులు కవిటి పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఈ విషయంపై సిఐ చిన్నంనాయుడును వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

సమస్యల వలయంలో శివరాంపురం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని నగరంపల్లి పంచాయతీ పరిధిలో శివరాంపురం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుందని సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు అన్నారు. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా మంగళవారం సిపిఎం నాయకులు మంగళవారం ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన రహదారితో అనుసంధానం చేసే సుమారు 750 మీటర్ల పనులకు 2018లో శంకుస్థాపన చేసినా అన్నారు. ఇదే రహదారికి మరలా 2020లో మరో ప్రభుత్వం శంకుస్థాపన చేసి మరో శిలాఫలకం వేశారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఈ రోడ్డు నిర్మించలేదని తెలిపారు. రెండు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో చిక్కుకున్నారని తెలిపారు. ఇంటింటికీ కుళాయిలు లీకులు కావడంతో తాగునీటి సమస్య తలెత్తుతుందన్నారు. చాలా మందికి వితంతు పింఛన్లు అందడం లేదని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న నగరంపల్లి సచివాలయం వద్ద ఆందోళన చేపడతామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్.మోహనరావు, ఎస్.చంద్రయ్య, బి.భాస్కరరావు, బి.శ్రీను పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనానికి ఆహ్వానం

పలాస : ఉగాది సందర్భంగా పలాస–కాశీబుగ్గ జన జాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన లయన్స్ క్లబ్ సౌజన్యంతో స్థానిక లయన్స్ క్లబ్ హాల్‌లో ఈ నెల 30న ఉదయం 10 గంటల నుంచి విశ్వావసునామ సంవత్సర ఉగాది ఉత్సవ నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి, అధ్యక్షులు డాక్టర్ కుమార్‌నాయక్, ప్రధాన కార్యదర్శి బందాలి కాళిదాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉగాది కార్యక్రమంలో ఉత్తరాంధ్ర స్థాయి కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం, శాస్త్రీయ నృత్యాలు, భక్తి గీతాల ఆడియో విడుదల, ఆమని చిగుళ్లు – కోయిల కువకు 'ప్రసంగం, లబ్ద ప్రతిష్టులైన ఐదుగురు పద్య కవులకు ఆత్మీయ సత్కారం ఉంటుందని తెలిపారు. పాల్గొను కవులకు ఉగాది విందు ఉంటుందన్నారు. కవిత సామాజిక అంశంపై ఉండాలన్నారు. రాజకీయ అంశాలకు, అనుచిత వ్యాఖ్యలకు తావు లేదని తెలిపారు. స్వీయ కవిత పఠనం మాత్రమే అన్నారు. నాలుగు పద్యములు, ఇరువది పంక్తుల వచన కవిత ఈ నెల 25లో లయన్స్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి 9440334110 వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. ఉపోద్ఘాతములకు అనుమతి లేదన్నారు. సమయం కేవలం నాలుగు నిమిషాలు మాత్రమేనని తెలిపారు. రాత ప్రతులు అనుమతించబడవన్నారు. తుది నిర్ణయం నిర్వాహకులదేనని, ఎటువంటి ప్రవేశ రుసుం లేదని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

హేమసుందరరాజు

కోటబొమ్మాళి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు హేమసుందరరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కళాశాలకు ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ధ్రువపత్రాలు తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల వివాదంపై ఆర్‌డిఒ దర్యాప్తు

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుల వివాదంపై టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి సోమవారం రాత్రి దర్యాప్తు నిర్వహించారు. వివాదానికి గల కారణాలపై ఆరా తీశారు. పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ఎలుగు ప్రసాద్ సస్పెండ్ కావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు సస్పెండ్ అయిన తర్వాత జరిగిన పరిణామాలను వివరాలు సేకరించారు. ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్, ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డిలతో మాట్లాడారు. మహిళా విద్యార్థినులపై అసభ్యకరంగా వ్యవహరించినశైలిపై ఆర్‌డిఒ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన ఫిర్యాదు కాపీలను, పరిణామాలకు సంబంధించిన వీడియో, ఆడియోలను ఆర్‌డిఒకు చూపించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన అల్లు తులసమ్మను విచారించారు. విద్యార్థినులపై అనుచితంగా ప్రవర్తించిన సదరు తెలుగు ఉపాధ్యాయుడు ప్రసాద్ గతంలో పోక్సో చట్టం కింద అరెస్టు అయి సస్పెండ్ అయిన విషయాన్ని అధికారులు ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి నేతాజీ కులం పేరుతో దూషించిన విషయమై భాధిత ఉపాధ్యాయుడు ప్రసాద్ టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు విషయాన్ని ఆర్‌డిఒ తెలిపారు. విద్యార్థులు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్ పంపనున్నట్లు తెలిసింది. కాగా, ఆర్‌డిఒ చేపట్టిన ఈ విచారణలో భాధిత ఉపాధ్యాయులు ప్రసాద్, అతని భార్య, ఎంఇఒ–2 దాసుపురం చిన్నారావు, పాఠశాల ఉపాధ్యాయులు పడాల గణపతిరావు, మిగిలిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు ఆర్‌డిఒను కలిశారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అపారిశుధ్యం

పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి- గుజరాతీపేట

శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో అపారిశుధ్యం తాండవిస్తోంది. మరుగుదొడ్ల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యం పాలైందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్ల దుర్వాసనతో ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. శుభ్రతా చర్యలు లేకపోవడంతో కాంప్లెక్స్ మొత్తం దుర్గంధంతో అలమటిస్తోంది. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు ఈ అపరిశుభ్రత వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరుగుదొడ్లను శుభ్రపరిచే సిబ్బంది లేకపోవడంతో గాలి పీల్చడానికి ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడికి వచ్చామంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. ఈ దుర్వాసనలో ఎలా ఉండాలో తెలియడం లేదని ప్రయాణికులు తమ బాధను వ్యక్తం చేశారు. ప్రయాణికుల ఆరోగ్యం, ప్రాథమిక సౌకర్యాలను పక్కన పెట్టి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రజల కోసం అందుబాటులో ఉండాల్సిన బస్‌స్టేషన్ ప్రాంగణం ఇంత అపరిశుభ్రంగా ఉంది.

పదవుల కోసం 'తమ్ముళ్లు' క్యూ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు పొందేందుకు నేరుగా రాజధానికి తెలుగు తమ్ముళ్లు క్యూ కడుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నామినేటెడ్ పదవులు భర్తీకి ఆయా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే నుంచి పేర్లను అడగడంతో ఈ నియోజకవర్గంలో ఆశావహులు రాజధానిలో ఉన్న ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్‌ను కలవడానికి పోటీ పడుతున్నారు. కొంతమంది పార్టీ అధ్యక్షుని పదవి, మరికొంత మంది నామినేటెడ్ పదవులకు బ్యాచ్‌లు వారీగా వెళ్తున్నారు. పదవులు ఆశిస్తున్న వారికి మద్దతుగా కొందరు.. ఇలా ఎవ్వరు ప్రయత్నాలు వారు చేస్తున్నారు. రాజధానికి వెళ్లిన వారికి మాత్రమే పదవులు ఇచ్చే ఆలోచన ప్రభుత్వ విప్ లేరని సమాచారం. పార్టీ కోసం ఎవ్వరు కష్టపడి పనిచేసేరో వారికి తప్పక సముచిత స్థానం ఇస్తామని విప్ ఇటీవల స్పష్టం చేశారు. అయినా కొందరు నేతలు నేరుగా కలిసి తమ అభిమతం చెప్పేందుకు ప్రయత్నం మాత్రం చేస్తున్నారు. అందులో భాగంగానే తెలుగు తమ్ముళ్లు పలువురు రాజధానిలో మకాం వేశారు. మరికొంత మంది త్వరలో ప్రయాణానికి సిద్ధం చేసుకుంటున్నారు.

పనులను పరిశీలిస్తున్న అధికారులు

చురుగ్గా కల్వర్టు పనులు

మెళియాపుట్టి : మండలంలో గొప్పిలి సమీపం గెయిల్ గ్యాస్ కంపెనీ వ్ద రోడ్డు కల్వర్టు పనులు వారం రోజులుగా సాగుతున్నాయి. కల్వర్టుకు రంధ్రం ఏర్పడడంతో ఇక్కడ మరమ్మతులు పనులు చేపడుతున్నారు. రూ.5 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బి ఎఇ నాయుడు తెలిపారు. ఈ పనులను ఆర్‌అండ్‌బి ఇఇ రవికాంత్ పర్యవేక్షిస్తున్నారు.

13న జిల్లాస్థాయి మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్ష

మాట్లాడుతున్న బృందావన్ దళాయి

ప్రజాశక్తి- కవిటి

జిల్లాలో ఒడియా మాధ్యమంలో చదువుతున్న ఐదో తరగతి పిల్లలకు ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) తరపున ఏప్రిల్ 13న జిల్లాస్థాయి మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దళాయి తెలిపారు. ఈ మేరకు మండలంలోని సహలాలపుట్టుగ ఒడియా ఉన్నత పాఠశాల ఆవరణలో అపోటా మండల శాఖ అధ్యక్షుడు కేశవ పురియా అధ్యక్షతన మంగళవారం సన్నహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా జిల్లాలో ఒడియా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసనసభలో సమగ్రంగా చర్చించిన ప్రభుత్వ విప్ అశోక్‌కు అపోటా తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఒడియా విద్యార్థుల సంఖ్య పెరగడానికి మేధా సమ్మాన్ పరీక్షలు దోహదపడతాయని అన్నారు. మార్చి 25 లోగా ప్రతి పాఠశాల నుంచీ ఐదుగురు విద్యార్థుల పేర్లు పంపించాలని కోరారు. మండలంలోని సహలాలపుట్టుగ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది మేధా సమ్మాన్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి మనోజ్‌కుమార్ మహారాణ, సంయుక్త కార్యదర్శి త్రిలోచన పొల్లాయి, ప్రమోద్ కుమార్ పాడి, బి.దేవదాసు, కిరణ్‌కుమార్, తులసీప్రధాన్, గిరిధర్ ప్రధాన్, శ్రీధర్ సామాంట్, సుమంత్‌ఫాడి, జి.విజయకుమార్, లింగరాజ్ బెహరా పాల్గొన్నారు.

ఎస్‌బిఐ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అమరావతి సర్కిల్ జిఎం హేమంత్‌కుమార్

మాట్లాడుతున్న జిఎం హేమంత్ కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘకాలం పాటు ప్రజల ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూ సంస్థ మనుగడకు శ్రమించి ఉన్నత స్థితికి కారణమైన ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌బిఐ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అమరావతి సర్కిల్ జనరల్ మేనేజరు హేమంత్ కుమార్ అన్నారు. నగరంలోని హోటల్ సన్‌రైజ్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించిన ఎస్‌బిఐ పెన్షనర్ల అసోసియేసన్ అమరావతి సర్కిల్ నాలుగో మహాసభల్లో పాల్గొని మాట్లాడారు. వృత్తిలో ఉన్నకాలంలో ప్రజలకు దగ్గరగా ఉంటూ సేవలందించిన ఉద్యోగులు విశ్రాంత తర్వాత కూడా సేవలందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి ఉద్యోగీ ఉద్యోగ విరమణ తర్వాత ఉత్సాహంగా ఉండాలంటే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. పెన్షనర్లకు వ్యక్తిగతంగా, సామూహికంగా ఎలాంటి సమస్య ఉన్నా తాను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో డిజిఎం సౌరబ్ గౌస్, అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి శంకర్ పాల్గొనడంతో ఆమెను సన్మానించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పలాస : పలాస జిఆర్‌పి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతుని వయసు 50 నుంచి 55 మధ్యలో ఉంటుందన్నారు. మృతిదేహాన్ని గుర్తించినట్లయితే 940627567 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తుండగా మండలంలోని తొటూరు ఎల్‌సి గేట్ వద్ద రూరల్ పోలీసులకు పట్టుబడ్డారని డిఎస్‌పి పి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిందితుడిని విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమానాస్పదస్థితిలో ఆయన బ్యాగ్‌ను తనిఖీ చేయగా, 21.040 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిశాలో తక్కువ ధరకు కొనుగోలు చేసే ఎక్కువ ధరకు అమ్మకాలు చేసేందుకు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని అన్నారు. ఆయనను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సిఐ మీసాల చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంచరిస్తున్న ఏనుగులు

వసపలో ఏనుగులు

కొత్తూరు : మండలంలోని వసపలోని ఐదు రోజులుగా వంశధార నది తీరం సమీపంలోని మామిడి తోటల్లో నాలుగు ఏనుగులు గుంపు సంచరిస్తున్నాయి. మంగళవారం సంచరించడంతో భయాందోళన చెందుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా సంచరిస్తుండడంతో పనులు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఏనుగులకు కవ్వింపు చర్యలకు పాల్పడరాదని ఫారెస్టు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఆస్తిపన్ను వసూలుకు బృందాలు

మున్సిపల్ కమిషనర్ రామారావు

మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

ఆస్తి పన్ను వసూలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సిబ్బందిని సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూలుపై మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు, ఆర్‌పిలతో మంగళవారం టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీమ్ సభ్యులందరూ ఆస్తి పన్ను వసూలును వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఎవరైనా అలసత్వం వహించినా, బాధ్యతాయుతంగా ప్రవర్తించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఆస్తి పన్ను చెల్లింపులో పట్టణ ప్రజలు సహకరించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమర్ పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

వేలంపాట ఖరారు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలోని జీడి తోట వేలం పాట రూ.1,40,500 ఖరారైనట్లు ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగి నాయిడు అధ్యక్షితన 2025–26 ఏడాదికి జీడి తోట ఫలసాయం పొందేందుకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. పాటలో కె.రమేష్‌బాబు, జి.యర్రయ్య, కె.ఢిల్లీశ్వరరావు, మామిడి మోహనరావు, ధరామత్ చెల్లించి పాటలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాటగా రూ.1,32,400 ప్రకటించగా, కరుకోల రమేష్‌బాబు రూ.1,40,500కు పాట పాడి కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ విజయకుమార్, కార్యదర్శి ముకుందరావు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం 'శక్తి'

అవగాహన కల్పిస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి- నరసన్నపేట

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని శక్తి టీం సబ్ ఇన్‌స్పెక్టర్ వి.బాలకృష్ణ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ఆపద కాలంలో అత్యవసర సహాయం అందించేందుకు శక్తి యాప్ కీలకంగా పనిచేయనుందని తెలిపారు. ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఈ శక్తి యాప్‌లో తప్పిపోయిన పిల్లల వివరాలు, అక్రమ కార్యకలాపాలపై ఫిర్యాదు చేయాలన్నారు. రాత్రి వేళల్లో భద్రతతో కూడిన ప్రయాణం, పోలీసు అధికారుల వివరాలు ఫీచర్స్‌ను పొందుపరిచారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాస్, అధ్యాపకులు లాక్కోజు గౌరీశంకర్, రమణ, కానిస్టేబుళ్లు కుసుమ, ప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టర్ల సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

శ్రీకాకుళం అర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో వాటర్ వర్క్సు విభాగం ఫిట్టర్‌గా పనిచేస్తున్న డి.చంద్రశేఖర్ కుమారుడు రామకృష్ణ అనారోగ్యం బారిన పడి విశాఖలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని వైద్యం కోసం రోజుకు రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో ఆర్థిక స్థోమత సరిపోక మున్సిపల్ కాంట్రాక్టర్లను ఆశ్రయించాడు. అతని ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న మున్సిపల్ కాంట్రక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన అతనికి రూ.53,500 ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. దాతలు ముందుకొచ్చి ఆకుటుంబానికి అండగా నిలవాలని కాంట్రాక్టర్లు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టర్లు జి.వి.రామినాయుడు, హెచ్.హరికృష్ణ, గంగురాజు, జి.సుదర్శన్, కిల్లి మోహన్, రవికుమార్ పాల్గొన్నారు.

అత్యవసర సమాచారాలకు ఫోన్

రిమ్స్ ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ పార్వతి

మాట్లాడుతున్న డాక్టర్ పార్వతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రిమ్స్, జిల్లా సర్వజనాస్పత్రి ప్రసూతి విభాగంలో రోగుల సమాచారాన్ని తెలుసుకునేందుకు అత్యవసర సమాచారం చేరవేసేందుకు మొబైల్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు విభాగం అధిపతి డాక్టర్ డి.పార్వతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రసూతి విభాగంలో మొబైల్ సేవలను డిఎంహెచ్ఒ డాక్టర్ బాలమురళీకృష్ణ, రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ డి.పార్వతిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులను రిఫర్ చేసేటప్పుడు ఆ సంబంధిత కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రోగి ఆరోగ్య పరిస్థితిని, ప్రథమ చికిత్స, రక్తం గ్రూపు అండ్ మోతాదు సమాచారాన్ని ముందస్తుగా చేరవేసేందుకు ఈఫోన్ నంబరు ఉపయోగపడుతుందన్నారు. ప్రసూతి స్త్రీలతో పాటు, నవజాతాశిశు మరణాలను తగ్గించడానికి అత్యవసర సమాచార సేకరణ ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ సేవలను వినియోగించుకునేలా సిహెచ్‌సిలు, పిహెచ్‌సిలకు ఫోన్ నంబరును అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఐరిస్క్ ప్రోగ్రామ్ మహిళలకు త్వరితగతిన సేవలందించి జిల్లాలో ప్రసూతి మరణాల రేటును తగ్గించవచ్చున్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ఓటర్ల జాబితా సవరణపై సూచనలు

ప్రజాశక్తి- టెక్కలి

2025 ఎస్ఎస్ఆర్‌కు సంబంధించి ఓటర్ల జాబితా సవరణలపై రాజకీయ పార్టీలు తమ సూచనలు చేయాలని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి కోరారు. తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో ఏమైనా మార్పులు, చేర్పులు, తొలగింపులు, సవరణలు ఉంటే చెప్పాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఈ సవరణలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, వెలమల కామేశ్వరరావు, బోయిన రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు టంకాల బాలగంగాధర్ గుప్త పాల్గొన్నారు.

ఎంఇఒ ఆకస్మిక సందర్శన

రణస్థలం: మండలంలోని కొండములగాం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను అకడమిక్ మోనటరింగ్ అధికారి కె.ధర్మకుమార్ మంగళవారం ఉదయం సందర్శించారు. వేసవిలో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఎస్ఎ–2 పరీక్షలకు సన్నద్ధం కోసం తగిన సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సోమవారం నిర్వహించిన తెలుగు, వచ్చే పరీక్షల కోసం చర్చించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యుత్ మీటర్ రీడర్ల ఆందోళన

ఆందోళన చేస్తున్న మీటర్ రీడర్లు

పలాస : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తుండంతో ఆ ప్రభావం వల్ల ఐదు వేల కుటుంబాలు రోడ్డు పడతాయని ఎఐటియుసి డివిజన్ నాయకులు చాపర వేణుగోపాల్, జిల్లా మీటర్ రీడర్స్ అధ్యక్షులు ఆర్.కుమారస్వామిలు అన్నారు. విద్యుత్ మీటర్ల రీడర్లతో పలాస విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌శాఖను నమ్ముకొని 15 నుంచి 20 ఏళ్లుగా మీటర్ బిల్లులు తీస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఐఆర్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్ల బిగిస్తున్న నేపథ్యంలో వారు జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ డిఇని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మీటర్ రీడర్స్ జిల్లా కార్యదర్శి దూగాన భాస్కరరావు, డివిజన్ అధ్యక్షులు బి.ఓంకార్, కార్యదర్శి కె.నరేష్ పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

లావేరు: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గోవిందపురం పంచాయతీ టిడిపి నాయకులు యినపకుర్తి భాస్కరరావు అన్నారు. గోవిందపురం– రాముని పాలెంకు గ్రామాలకు సిసి రోడ్డు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణానికి రూ.పది లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. సిసి రోడ్డు, కాలువలను ముమ్మరంగా నిర్మిస్తామని అన్నారు. మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, ఉపసర్పంచ్ చిక్కలా ఎల్లన్నదొర, రౌతు తాతారావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న భాస్కరరావు

ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఉదారత

ఇచ్ఛాపురం : చదువుకున్న పాఠశాలలో భోజనశాల లేక ఇబ్బందులు పడుతున్న విషయం పూర్వ విద్యార్థులు గుర్తించారు. ఈ మేరకు రూ.58 వేలు భోజనశాఖ నిర్మాణానికి హెచ్ఎం ఎంనరేంద్రనాథ్‌కు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006లో పదో తరగతి చదువుకున్న 63 మంది విద్యార్థులు తమకు తోచినరీతిలో అందించి తమ ఉదారత చాటుకున్నారు.

రోటరీ సేవలు విస్తృతం

ధ్రువపత్రాలను అందజేస్తున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోటరీ సేవలు విస్తృతం చేయాలని రోటరీ డిస్ట్రిక్టు 3020 గవర్నర్ డాక్టర్ మల్లా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని బృందావన ఫంక్షన్ హాల్లో రోటరీ ఆధ్వర్యాన పేదలకు కుట్టు మిషన్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబమూ ఆర్థికంగా నిలదొక్కుకుని సమాజంలో గౌరవాన్ని పొందాలన్నారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టు ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. అంతకుముందు హౌసింగ్ బోర్డ్ కాలనీలోని రోటరీ వనాన్ని సందర్శించి మొక్కలను నాటారు. బ్యాంకర్స్ కాలనీలో సత్యసాయి మందిరంలో రోటరీ, సత్యసాయి సంయుక్త ఆధ్వర్యాన కంప్యూటర్ ఉచిత శిక్షణా కేంద్రం (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను) లాంఛనంగా ప్రారంభించారు. క్లబ్ ఒకేషనల్ డైరెక్టర్ డాక్టర్ మంత్రి వెంకటస్వామి పర్యవేక్షణలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన పది మందికి రోటరీ పురస్కారాలను అందజేశారు. సమావేశంలో క్లబ్ అధ్యక్షులు ముని శ్రీనివాసరావు, కార్యదర్శి దూసి సంతోష్, సహాయ గవర్నర్ రజనీకాంతరావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ దేవరశెట్టి శివశంకర్, ప్రెసిడెంట్ ఎలక్ట్ బరాటం శ్రీనివాస, సెక్రటరీ ఎలక్ట్ కిల్లాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిఎంతో మండల టిడిపి నాయకులు

సిఎం దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి- పొందూరు

మండల సమస్యలను సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి టిడిపి మండల అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్ తీసుకెళ్లారు. అమరావతిలోని సిఎం ఛాంబర్‌లో పియుసి చైర్మన్ కూన రవికుమార్‌తో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని మధ్యంతరంగా నిలిచిపోయిన మడ్డువలస కాలువ రెండో దశ పనులు, తండ్యాం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని కోరారు. సిఎంను కలిసిన వారిలో ఎఎంసి మాజీ చైర్మన్ అన్నెపు రాము, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లావేరు : మండలంలోని బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. గ్రామ సచివాలయల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. ఈ నెల 22లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

సోంపేట : నాటుసారాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అధికారులంతా సహకరించాలని ఎక్సైజ్ సిఐ కె.బేబీ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నవోదయం–2 కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి అధికారులతో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సోంపేట సిఐ రమేష్‌కుమార్, ఎస్ఐ లవరాజు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు కోరారు.

మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ బేబీ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్ హెచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డీన్ డాక్టర్ ఆర్.శాంతి కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అగతమూడి లక్ష్మణరావులు 'స్టాటిస్టికల్ మెథడ్స్ ఫర్ ఇంజినీర్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కంప్యూటర్ సైన్స్ అనుసంధానంగా ఉన్న అన్ని బిటెక్ కోర్సుల విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెస్టా ్గడీన్ డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్‌డిలు డాక్టర్ రత్నమణి, డాక్టర్ మల్లా రమణయ్యలు పాల్గొని రచయితలకు అభినందించారు.

టిడిపిలో పలువురు చేరిక

కొత్తూరు : వైసిపి నుంచి పలువురు టిడిపిలోకి చేరారు. ఎఎంసి మాజీ చైర్మన్ గోగుల వరప్రసాదరావు నాయుడు, సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, పప్పల కేశవరావు, పారాపురానికి చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు కంచాల నూనకాజు, సర్పంచ్ ప్రతినిధి కుంచాల చిన్నారావులు విజయవాడలోని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సమీక్షంలో మంగళవారం చేరారు. వీరి కలయికతో మండలంలో పార్టీ మరింత బలోపలవుతుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా విజయం చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాతల గాంధీ, ఆగతముడి మాధవరావు, ఆగతముడి అరుణకుమార్, ముగిటి కృష్ణారావు, ఎల్.జనార్ధనరావు, చోడవరపు రాము, చింతాడ కోటి, టి.తిరుపతిరావు, పి.గోవిందరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కారాదు

పొందూరు: గంజాయి, డ్రగ్స్ వంటి మతపదార్థాలకు యువత బానిస కారాదని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని లోలుగు కూడలి వద్ద మంగళవారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. మైనర్ల వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు చేపడుతామని హెచ్చరించారు. ఈయనతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు 2025 జామ్ పరీక్షలు ఆల్ ఇండియాలో బాకి ఈశ్వరి 467, గడియా జ్యోతి 786, బాడిత్య పూజిత 1333 ర్యాంకులు సాధించారు. వీరికి ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాడి మంగళవారం అభినందించారు. కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు ఎన్.శివకుమార్ ర్యాంకులు సాధించడంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరావు, త్రిపాఠి, సంతోష్‌కుమార్, ఆనందరావు, మోహన్, ఈశ్వర, బృందావనం, వరప్రసాద్ పాల్గొన్నారు.

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాబిన్‌కుమార్ పాడి

ద్రవ జీవామృతం తయారీ

ద్రవ జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- రణస్థలం

ద్రవ జీవామృతం ఉండగా... రసాయన ఎరువులు దండగని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ అన్నారు. మండలంలోని జీరుపాలెంలో గుడిసె శివకుమార్ అనే రైతు 20 ఎకరాల కొబ్బరి తోటకు 3200 లీటర్ల ద్రవజీవామృతం మంగళవారం తయారు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన పద్ధతుల్లో ఎరువులు వేయడం వల్ల అధిక పెట్టుబడులు, నేలతల్లి ఆరోగ్యం క్షీణించి పోతుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నేలను సారవంతం చేసి సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని పెంపొందించి మొక్కకు కావాల్సిన పోషకాలను అందించవచ్చునని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయ గ్రామ కార్యకర్త బోనెల వెంకటలక్ష్మి సమక్షంలో ద్రవ జీవామృతం తయారు చేశారు. అలాగే తిరుపతిపాలెంలో ఎన్ఆర్ఐ రైతు రమేష్ పదెకరాలకొబ్బరి తోటకు వెయ్యి లీటర్లు ద్రవ జీవామృతం యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి సమక్షంలో తయారు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్తలు గిడిజాల సూర్యకాంతం, ఇంద్రావతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎండలో సైతం ఆగని దీక్ష

దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

కవిటి: ఓవైపు ఎండ తీవ్రత పెరుగుతున్నా వెరవకుండా బెంతు ఒరియాలు తమ దీక్షలు కొనసాగిస్తున్నారు. తమ బిడ్డల ఉన్నత చదువులు, యువతీ యువకుల ఉద్యోగాన్వేషణకు తమకు తప్పనిసరిగా తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాల్సిందేనని వారు స్పష్టం చేస్తున్నారు. అంతవరకు తమ పోరాటం ఆగదని తెగేసి చెబుతున్నారు. తమకు సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 447వ రోజుకి చేరుకున్నాయి. మంగళవారం దీక్షలో సూదిపుట్టుగ గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నట్టు తెలిపారు. అందుకే తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నవీన్ దళాయి, ప్రవీణ్ దళాయి, రాజేష్ దళాయి పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణతో అన్యాయం

మాట్లాడుతున్న శ్రీను

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి వర్గీకరణతో మాలలకు, రెల్లిలకు అన్యాయం జరుగుతుందని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డాక్టర్ కంఠ వేణు, తైక్వాండో శ్రీను, రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు ఆర్.జి.కోటిలు ఆవేదనను వ్యక్తం చేశారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని వర్గీకరణ చేపడితే కొన్ని తరగతులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్‌సి వర్గీకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు యజ్జల గురుమూర్తి, సింకి రమణ, పెయ్యల చంటి, ఎస్.సూర్యనారాయణ, అబ్బాస్, ఆర్.జి.ఈశ్వరరావు, దూళి మోహన్, తిరుపతిరావు, రామ్మోహనరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

చిత్రపటాలకు పాలాభిషేకం

మెళియాపుట్టి : మండలంలోని ఆంపురంలో సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల టిడిపి మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కువగా గిరిజనులు ఉన్న మండలం మెళియాపుట్టి అని, అక్కడే ఐటిడిఎ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శాసనసభలో ప్రస్తావించారని అన్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు రూ.25 కోట్లు బిటి రోడ్లకు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. గిరిజన జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రస్తావించారని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకుడు వాబ యోగి, బైరాగి, కామేష్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గిరిజనులు

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

కార్మికుల సమస్య పరిష్కారానికి చేపడుతున్న ఆమరణ దీక్షలకు మద్దతు ఇవ్వాలని పలాస రైల్వే శ్రామిక యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.జగదీశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరరావులు కోరారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 24న డివిజనల్ కోఆర్డినేటర్ పి.కె.పట్నానీ ఆమరణ నిరాహారదీక్షలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయనకు మద్దతుగా మంగళవారం రాత్రి పలాస రైలు నిలయం ఆవరణలో కొవ్వొత్తులతో నిరసన ధర్నా చేశారు. ట్రాక్ మెయింటెన్స్ కార్మికులపై వేదింపులు, పాతపింఛను విధానం అమలు, రన్నింగ్ స్టాఫ్కు మినిమం కిలోమీటరు గ్యారెంటీ వంటి పలు డిమాండ్లను రైల్వేశాఖ దృష్టిలో పెట్టినా స్పందించలేదన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఎ.రామకృష్ణ, ఆఫీస్ బేరర్లు సుధీర్, పి.ప్రదీప్, బాలకృష్ణ, ఎల్.వి.రావు, హరికృష్ణ పాల్గొన్నారు.

లోకేష్‌ని కలిసిన ఎమ్మెల్యే

వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

రణస్థలం రూరల్: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. డిగ్రీ కళాశాల, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు ఆవశ్యకతను మంత్రికి వివరించారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు, అంబేద్కర్ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటి వంటి విద్యా సంస్థలకు సంబంధించి, రైతులు సాగునీటి కోసం పడుతున్న అవస్థలను కూలంకుశంగా వివరించారు. లోకేష్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

నినాదాలు చేస్తున్న నాయీబ్రాహ్మణులు

సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి : ప్రభుత్వం ద్వారా నాయీబ్రాహ్మణులకు రావాల్సిన సౌకర్యాలు, రాయితీలు విడుదల చేయాలని సంఘ నాయకులు కె.రామారావు కోరారు. ఈ మేరకు టెక్కలిలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వపరంగా రావల్సిన సౌకర్యాల కల్పనలో వెనుకబాటు తనానికి గురవుతున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కారానికి పోరాటం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కారానికి ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు ఇప్పిలి చిన్నారావు, ధర్మారావు, ఎస్.వెంకటరావు, వీరాస్వామి, అప్పారావు పాల్గొన్నారు.